# మరో "పులి పులి" కథ

రుద్రాభట్ల నరసింగరావు

ఇద్దరు వయస్సులో ఉన్న కుర్రవాళ్లు తమ అభ్యంతర మందిరంలో (అనగా 'ఇతరులు లోనికి రాకూ' దని వీధివైపు కొట్టుగది) కూర్చున్నారు. ఒకతను సిగరెట్లు తయారు చేసుకొంటున్నాడు. (స్త్రీలని అనుకరించడంలాగే, పల్లె ప్రజలని కొత్త పద్ధతుల్లో అనుకరించడం కూడా ఒక ఫేషన్ గదా.) ఇంకొకతను దీపావళి సంచిక చూస్తున్నాడు. వారిమధ్య బల్లమీద కాళీ అయిన రెండు టీగ్లాసులున్నాయి వాళ్లిద్దరూ వీధివైపు కిటికీ దగ్గిర కూర్చున్నారు

సిగరెట్ల ఉత్పత్తిదారు పేరు వేణు.

పత్రిక చదువుకుంటున్నతని పేరు రఘు.

వేణు అప్పుడప్పుడు వీధివైపు చూస్తున్నాడు

'ఆఁ వొచ్చిందిరోయి.' అన్నాడు వేణు. అని వెంటనే 'పైట జారిన పైదలి' అనికూడా వివరించేడు.

మొదటి మాటకి లక్ష్యపెట్టకపోదాం అనుకున్నరఘు రెంటో మాటకి చప్పన తలఎత్తేడు.

వేణు అన్నది నిజమేలా ఉన్నా పరకాయించి చూస్తే శుద్ధ అబద్ధం.

ఒక జవ్వని అంచులేని నీలపు పాలియస్టర్ జార్జెట్ చీరా అదేరంగు జాకెట్టూ వేసుకుంది. పైట హత్తుకునేలా వేసుకోవడంవల్లా, అంచు లేకపోవడంవల్లా కాసంత భ్రాంతీ, కొండంత దిగ్భ్రాంతీ కలిగిస్తోంది.

ఇలాటి దృశ్యాల్ని రఘు తను పుట్టినప్పటి నించి చూస్తున్నాడు. పెదవివిరిచి పత్రికలో తల దూర్చేడు.

సిగరెట్లు పూర్తయేయి. ఒకటి రఘు కిచ్చి ఒకటి తను ముట్టించుకున్నాడు వేణు

రఘు తన సిగరెట్టుని అలాపక్కన పెట్టుకున్నాడు. రెండు పీల్పుల తర్వాత అడ్డువొస్తున్న పొగని చేత్తో తోలుతూ చూసి అన్నాడు వేణు.

'మళ్ళీ వొచ్చింది రోయి, కాస్తజారిన కామాక్షి'

విసుగుకుంటూ తలెత్తేడు రఘు.

నారింజ పండురంగు జాకెట్టూ సిగరెట్టు పేపరు లాంటి తెల్ల చీరా కట్టుకుని ఉంది. కాస్తేం, జానెడుపైగా జారిపోయి అలానిలిచి నట్టుంది పైట.

'వెధవ సిగరెట్టూ నువ్వూను.' అంటూ జాగ్రత్తగా చూసేడు రఘు.

ఆ తెల్లచీరకి జానెడు పైగా నారింజ పండు రంగు అంచు ఉంది.

ఈ ఫేషనూ రఘు ఎరగని దేమీ కాదు.

అన్నీ Optical illusions! (భ్రాంతులు) సత్యమైన దొక్కటీ లేదు ఈ ప్రపంచములో- అనుకున్నవాడి మొహంతో ప్రత్యేక సంచికలో మొహం దూర్చేడు రఘు.

సిగరెట్టు అయిపోయింది వేణుకి.

'అద్భుతంరోయి' అని మాత్రం అని ఆత్రతగా కుర్చీలో ముందుకి జరిగి కిటికీ లోనించి చూడసాగేడు. రఘు తలెత్తినదీ లేనిదీకూడా గమనించే స్థితిలో లేడు వేణు.

మూడోసారి వొచ్చిన ముద్దుగుమ్మకి నిజంగానే పైట జారిపోయింది. కుచ్చెళ్లు కాలిచెప్పులో తగులుకుంటే తీసుకుందామని వొంగగా మీగడ లాంటి సిల్కుచీరేమో జారి చక్కా ఊరుకుంది. మెళ్లో ఏవో హారాలు వెలాడుతున్నాయి కూడా.

రఘు మాత్రం అదేమీ ఎరగడు. ఈసారీ వొట్టిదే అనుకున్నాడు.

ఆమె కుచ్చెళ్ళు సరిచేసుకుని పైట సర్దుకుని వెళ్లిపోయేక.

రఘుకి సంభవించిననష్టం తెలుసుకుని 'ఓరి ఫూల్!' అన్నాడు వేణు.

మినీ కథ